క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణలో బీఎల్ఓలు కీలకం

సంగెం : ఎన్నికల నిర్వహణలో బీఎల్ఓలు కీలకమని పరకాల ఎలక్టోరల్ అధికారి, ఆర్డీఓ డాక్టర్ నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో బీఎల్వోల పాత్ర కీలకమైందన్నారు. ఈసీ నిబంధనలు పాటిస్తూ ఎన్నికల నిర్వహణలో భాగస్వాములు కావాలని, ఓటరు నమోదులో తప్పులు లేకుండా చూడాలని, వయోజనులు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంఈఓ రాము, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల డీటీ సూర్యప్రకాశ్, సీనియర్ అసిస్టెంట్ భద్రయ్య, ఆర్ఐలు బాలాజీ, శారద, తదితరులు పాల్గొన్నారు.

రాస లక్ష్మణ్‌కు డాక్టరేట్



దుగ్గొండి : మండలంలోని తొగర్రాయికి చెందిన న్యాయవాది రాస లక్ష్మణ్ కాకతీయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఇటీవల డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గ్రామానికి చెందిన ఓదెమ్మ–కొమురయ్య దంపతుల కుమారుడైన లక్ష్మణ్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశాడు. ప్రస్తుతం కేయూ లా కాలేజీలో ప్రొఫెసర్‌గా, వరంగల్ కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. కేయూ లా కాలేజీ ప్రొఫెసర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో 'లా రిలేటింగ్ టు డిసిప్లినరీ ప్రొసీడింగ్ ఇన్ ఇండియా–ఏ స్టడీ విత్ రెఫరెన్స్ టు వర్క్ మెన్, సింగరేణి కంపెనీ లిమిటెడ్, ఇన్ స్టేట్ విత్ తెలంగాణ' అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి సంబంధించి డాక్టరేట్ అందుకున్నారు.

సబ్సిడీపై విత్తనాలు సిద్ధం

నర్సంపేట : చెన్నారావుపేట మండల రైతులకు సబ్సిడీపై అందించడానికి వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) గోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎన్ఆర్–15048 రకం విత్తనాల 25కిలోల సంచికి ధర రూ.1165 ఉండగా సబ్సిడీ పోగా రూ.665, కేఎన్ఎం–1638 రకం విత్తనాల 25 కిలోల సంచికి ధర రూ.1075 ఉండగా సబ్సిడీ పోగా రూ.575 చెల్లించి తీసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాస్‌బుక్కు, ఆధార్ జిరాక్స్‌లతో రైతు వేదికలో అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేకుల అందజేత

పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం పైకప్పుకు ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ అతడి కుమారుడు చేతన్ జ్ఞాపకార్థం రేకులను బుధవారం అందజేశారు. వర్షాకాలం నేపథ్యంలో రేకులు వేయించినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లూనావత్ మంగనాయక్, మాజీ సర్పంచ్ జనగాం సమ్మయ్య, నాయకులు కొత్తూరు రవి, మూడు మోహన్, కందికట్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం



రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన బెల్లి ఎల్లయ్యకు సంబంధించిన పశువుల కొట్టంలో గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కంకుమ, బుక్కా, నిమ్మకాయలతో మట్టి బొమ్మను పెట్టి క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు బుధవారం ఉదయం దర్శనమిచ్చాయి. దీంతో ఎల్లయ్య, గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. క్షుద్రపూజలు నిర్వహించిన వ్యక్తులను గుర్తించి చట్టరీత్యా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

విరాళం

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలో మడేలయ్య ఆలయ నిర్మాణానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం లక్ష రూపాయల విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండల ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి సామాజిక సేవలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు సంకలనం ఆవిష్కరణ

పర్వతగిరి : స్థానిక జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ మడత భాస్కర్ సంపాదకత్వంలో ప్రచురితమైన 'అమ్మకు ప్రేమతో' బృహత్ లేఖా సంకలనాన్ని నేడు ఆవిష్కరించనున్నారు. జూమ్ యాప్‌లో చక్రవర్తుల రాధాకృష్ణ సాహితీ వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6 గంటలకు తలపెట్టిన కార్యక్రమానికి చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షత వహించనుండగా దేశపతి శ్రీనివాస్ ఆవిష్కరిస్తారని భాస్కర్ ప్రకటనలో తెలిపారు. బండారి రాజ్‌కుమార్ పుస్తక సమీక్ష నిర్వహిస్తారన్నారు.

మొక్కజొన్నకు కత్తెర పోటు



కత్తెర పురుగు సోకిన మొక్కజొన్న పంట

నర్సంపేట : జిల్లాలో వరి తర్వాత మొక్కజొన్న, పత్తి పంటలకు ప్రాధాన్యత ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలతో జిల్లాలో రైతులు పత్తి, మొక్కజొన్న సాగు చేశారు. ఆది లోనే మొక్కజొన్నకు కత్తెర పురుగు, పత్తికి రసం పీల్చే పురుగు సోకడంతో పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. జిల్లాలో గతేడాది మొక్కజొన్న 763 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 9 వేల 820 ఎకరాల్లో సాగు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అలాగే గతేడాది పత్తి లక్షా 20 వేల 166 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది లక్షా 26 వేల 173 ఎకరాల్లో సాగు చేశారు.

వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులకు పెట్టుబడి పెరగడంతోపాటు గిట్టుబాటు ధర కూడా లభించని పరిస్థితులు నెలకొన్న విషయం జగద్విదితమే. పెద్దగా లాభాలు రాకపోగా పెట్టుబడి సైతం గిట్టుబాటు కాని దుస్థితి ఎదురవుతోంది. ఈ క్రమంలో రైతులు రెండేళ్లుగా ఆహార పంటలైన మొక్కజొన్న సాగుకు దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అనతికాలంలో చేతికి అందే పంట కావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ మంది కూలీల అవసరం, నూర్పిడి సమయంలో ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉండడం రైతులకు కొంత వెసులుబాటుగా ఉంటోందని చెప్పక తప్పదు. ఈ పరిస్థితుల్లో జిల్లావ్యాప్తంగా గతేడాదికి రెట్టింపు విస్తీర్ణంలో ప్రస్తుత ఖరీఫ్‌లో మొక్కొజొన్న సాగైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. కాగా ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కజొన్న పంట 15 రోజుల నుంచి నెల రోజుల వయసులో ఉంది. ఎదుగుతున్న పంటకు కత్తెర పురుగు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సత్వరమే నివారణ చర్యలు చేపట్టకపోతే 50 శాతం దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. కత్తెర పురుగు మొక్కజొన్న పంటలో మొదట ఆకులను ఆకులను ఆశిస్తూ కాండాన్ని తొలచివేసి చేను మొత్తాన్ని పశువులు మేసిన చందంగా తయారయ్యేలా చేస్తుంది. కత్తెర పురుగులు ఆకుపచ్చ, గోధుమ, నలుపు, గులాబీ రంగుల్లో ఉంటాయి. వాటికి తల భాగంలో వై ఆకారంలో తలకిందులుగా మచ్చ ఉంటుంది. ఇలా కనిపించిన పురుగులను కత్తెర పురుగులుగా నిర్ధారించొచ్చని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. యాజమాన్య పద్ధతులు పాటించి మొక్కజొన్న పంటను రక్షించుకోవచ్చని చెబుతున్నారు.

పురుగు మందుల వినియోగం ఇలా..

కత్తెర పురుగు నివారణలో ఇమామెక్టిన్ బెంజోయేట్ సమర్థవంతంగా పని చేస్తుంది. కొందరు రైతులు క్లోరాంట్రా నిలిప్రోల్ కూడా వాడతారు. థైయామెథోక్సామ్, అమ్లా–సైహాలోత్రిన్‌లను కూడా వాడొచ్చు. వేప నూనె పిచికారీ వల్ల కూడా కత్తెర పురుగును నివారించొచ్చు.

యాజమాన్య పద్ధతులు ఇలా..

మొక్కజొన్న పంట వేసే ముందు చేనులో గతంలో కత్తెర పురుగు ఆశించిన దాఖలాలుంటే పంట మార్పిడి చేయాలి. సేంద్రియ ఎరువుల వినియోగంతో మొక్కల ఎదుగుదల పెరిగి పురుగుల బారిన పడే అవకాశాలు తక్కువ. కత్తెర పురుగును నివారించడానికి ఇతర పురుగుల నివారణకు వాడే మందులను వాడొచ్చు. పంట వేసిన తర్వాత, పొలం చుట్టూ ఉన్న గడ్డి, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. సకాలంలో పంట వేయడం, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసేయడం ద్వారా పురుగుల ఉధృతిని నివారించొచ్చు. మొక్కలకు సరిపడా నీరు పెట్టడం, నీటి ఎద్దడి లేకుండా చూసుకోవడం ద్వారా కత్తెర పురుగును కొంత మేర నివారించొచ్చు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు నెక్కొండ మండలం పనికర శివారు మంగళ తండాకు చెందిన ధారావత్ రవి. తనకున్న రెండెకరాల్లో ఖరీఫ్‌లో మొక్కసాగు చేశాడు. ఏపుగా పెరుగుతున్న తరుణంలో కత్తెర పురుగు సోకింది. నివారణ చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటివరకు సుమారు రూ.25–30 వేలు ఖర్చు చేశాడు. గతంలో రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈసారి ముందుగానే కత్తెర పురుగు సోకడంతో దిగుబడి తగ్గుతుందేమోనని వేదనకు గురౌతున్నాడు.

రూ.30 వేల పెట్టుబడి



నాకు ఉన్న రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. మొలక దశలోనే కత్తెర పురుగు సోకింది. దీంతో పురుగు మందు పిచికారీ చేశా. గతంలో ఎన్నడూ లేని విధంగా పురుగు సోకడంతో భారీ నష్టం జరిగింది. పంటకు నీరు పెడదామంటే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నీరు అందక మొలకెత్తలేదు. ఉన్న కొద్దిపాటి పంటకు తెగుళ్ల సోకాయి.

– కట్ల స్వరూప, రైతు భానోజీపేట

సార్వత్రిక సమ్మె విజయవంతం

నర్సంపేట : నిరసన తెలుపుతున్న నాయకులు



ఖానాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు





దుగ్గొండి : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



నెక్కొండలో..



నల్లబెల్లిలో..



పర్వతగిరిలో..



సంగెం : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



గీసుకొండలో..

సాక్షి నెట్‌వర్క్ : సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐసీసీటీయూ, తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె సక్సెస్ అయ్యింది. వర్ధన్నపేట, చెన్నారావుపేట, ఖానాపురం, నల్లబెల్లి, దుగ్గొండి, నెక్కొండ, పర్వతగిరి, సంగెం, గీసుకొండ, తదితర మండలాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా సవరించడాన్ని ఖండించారు. కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలని డిమాండ్ చేశారు.

మహిళా సంఘాల ఉన్నతే ధ్యేయం



నర్సంపేట : చెన్నారావుపేటలో సంబురాల్లో అధికారులు, మహిళా సంఘాల సభ్యులు

● సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శంకర్



వర్ధన్నపేట : పాటలు పాడుతున్న కళాకారులు

నర్సంపేట/దుగ్గొండి/వర్ధన్నపేట/సంగెం:మహిళా సంఘాల ఉన్నతే ధ్యేయంగా ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తోందని, పలు కార్యక్రమాలు చేపడుతోందని సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు శంకర్, రేవతి, ఏపీఎంలు ప్రేమ్‌రాజ్, ముక్కెర ఈశ్వర్, కిషన్, రాజ్‌కుమార్ తెలిపారు. చెన్నారావుపేట, దుగ్గొండి, వర్ధన్నపేట, సంగెం మండలాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఇందిర మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎంలు, ఏపీఎంలు మాట్లాడారు. ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, రూ.2 లక్షల వరకు సభ్యులకు రుణ బీమా, రూ.10 వరకు ప్రమాద బీమా అందిస్తోందని తెలిపారు. మహిళా సంఘాలకు సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు, గోదాంల నిర్వహణ, మిల్క్ పార్లర్లు, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీలు, తదితర అనేక అవకాశాలు కల్పిస్తోందని వివరించారు.. మహిళలు సాధికారత సాధించాలని ఆకాంక్షించారు. వర్ధన్నపేటలో బతుకమ్మలతో ఆటపాటలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. దుగ్గొండిలో, వర్ధన్నపేటలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత నిర్వహించారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

● సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ పాషా



నెక్కొండ : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెక్కొండ/సంగెం : ఈనెల 16న హనుమకొండ జిల్లా కేంద్రంలోని సిటిజన్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న బ్యాండ్, వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మహ్మద్ చాంద్ పాషా కోరారు. రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నెక్కొండ, సంగెం మండల కేంద్రాల్లో బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బ్యాండ్, వాయిద్య కళాకారులు సరైన ఆదాయం లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం బలోపేతం, కళాకారుల సంక్షేమం కోసం చేపట్టనున్న భవిష్యత్ కార్యాచరణకు నాయకులు సదస్సులో రూపకల్పన చేస్తారని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడిపెద్ది వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వెండి బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోడేటి రాజు, మండల గౌరవ అధ్యక్షుడు నంగునూరు శంకర్, మండల అధ్యక్షుడు మహ్మద బషీర్, మండల ప్రధాన కార్యదర్శి పొడేటి రాజు, నాయకులు జంపాల కుమార్, మాంకాల సాంబయ్య, సొరపు నర్సింహస్వామి, రామనాథం, బాబు, రవి, కొమురయ్య, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీతక్క జన్మదిన వేడుకలు



నర్సంపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నాయకుడు జనగాం లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి మాట్లాడారు. సీతక్క మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు జనగాం లక్ష్మణ్, వాసం కుమారస్వామి, మధుసూదన్, మెరుగు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణ, హైమ, ఇర్ప పుల్లమ్మ, పొడెం రాణి, మల్లెల రజిత, చాట్ల నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి

● రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్



ఊకల్ సొసైటీ వద్ద మాట్లాడుతున్న శ్రీనివాస్

గీసుకొండ : పంట కాలం నేపథ్యంలో రైతులకు తక్షణమే సరిపడా యూరియా అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం మండలంలోని ఊకల్ సొసైటీని బుధవారం సందర్శించి యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. రైతులు విత్తనాలు వేసి నెల రోజులు గడుస్తున్నా యూరియా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన మేరకు యూరియా కోటా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తుండడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్రం వెంటనే సరిపడా యూరియా అందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

మద్యం మత్తులో హల్‌చల్

రాయపర్తి : మద్యం మత్తులో ఓ డీసీఎం డ్రైవర్ హల్‌చల్ చేసిన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమలాపురం తిరువూరు నుంచి మధ్యప్రదేశ్‌కు కొబ్బరికాయల లోడుతో డీసీఎం వెళ్తోంది. ఈ క్రమంలో డీసీఎంను అతివేగంగా ఇష్టారాజ్యంగా నడుపగా మైలారం గ్రామానికి చెందిన కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు డీసీఎంను నిలిపినా అతడి తీరులో మార్పు కన్పించకపోవడంతోపాటు హల్‌చల్ చేశాడు. వెంటనే డీసీఎంను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట : మద్యం మత్తులో ఓ వ్యక్తి పోలీసులను కాసేపు తిప్పలు పెట్టిన సంఘటన బుధవారం వర్ధన్నపేటలో చోటుచేసుకుంది. వర్ధన్నపేట పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా వర్ధన్నపేట నుంచి వరంగల్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న మారేపల్లి శేఖర్‌ను పోలీసులు ఆపి బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు. పోలీసులు ఎంత వారించినా శేఖర్ మాత్రం ససేమిరా అంటూ వారిని ఇబ్బంది పెట్టాడు.

ప్రైవేట్ స్కూళ్లను నియంత్రించండి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : ఫీజుల వసూలు, పుస్తకాల విక్రయం, తదితర విషయాల్లో ప్రైవేట్ స్కూళ్లను నియంత్రించాలని బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ కన్వీనర్ సదిరం వినయ్, బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు దేవోజు హేమంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ కొర్ర సారయ్యను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వినయ్, హేమంత్ మాట్లాడారు. పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు భారీగా వసూలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్నట్టు తెలిపారు. పట్టణంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్య వ్యాపారం చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కొలిపాక రవి తేజ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన కందికొండ రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి పదో తరగతి నాటి మిత్రులు బుధవారం రూ.10 వేల నగదుతోపాటు 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. రాజు చిత్రపటానికి నివాళులర్పించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాజు మిత్రులు లావుడ్య నవీన్, రాజు, జిడ్డి నవీన్, సతీశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో జెండా ఎగరేయాలి

● బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ యుగేంధర్‌రావు

పర్వతగిరి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేయాలని బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ ఇన్‌చార్జ్ బోయినపల్లి యుగేంధర్ రావు, మాజీ సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని ఏనుగల్‌లో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మాసాని వెంకట్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో యుగేంధర్‌రావు, శ్రీనివాస్ మాట్లాడారు. పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కోల మల్లయ్య, డాక్టర్ లింగమూర్తి, సతీశ్‌రావు, పెండ్లి రమేశ్, బూత్ కన్వీనర్లు మాసాని రవీందర్, దాసరి యాదగిరి, కానిగంటి రవీందర్, బుక్క కుమారస్వామి, మాసాని కమలహసన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

దుగ్గొండి : మండలంలోని బిక్కాజిపల్లికి చెందిన మేర్గు కట్టమల్లు సాకుతున్న దుక్కిటెద్దు బుధవారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. కట్టమల్లు తన దుక్కిటెద్దులను మేత కోసం పంట పొలాలకు తోలుకెళ్లగా ఓ ఎద్దు విద్యుత్ స్తంభం పక్కనున్న సపోర్ట్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని రైతు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన కోరాడు.

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన జూలపల్లి దేవేందర్‌రావు సాకుతున్న ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేతకు వెళ్లిన ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వల్లే ఎద్దు మృతి చెందిందని బాధిత రైతు వాపోయాడు.

విద్యార్థులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలి

వర్ధన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ విజయ్‌సాగర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ, ఏజెన్సీ ప్రాంత పేద విద్యార్థులు సరైన రవాణా సౌకర్యాలు లేక స్కూళ్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కక్కెర్ల రమేశ్, బర్ల నగేశ్, కంజర్ల రంజిత్, గాదె రాకేశ్, కట్కూరి సునీల్, రొడ్డ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీల బహూకరణ



బెంచీలతో వేదాచారి కుటుంబీకులు, హెచ్ఎం, తదితరులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌కు స్థానికుడు డాక్టర్ కల్వచర్ల వేదాచారి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు బుధవారం 20 బెంచీలు బహూకరించారు. అనంతరం వేదాచారి తల్లిదండ్రులు విజయ కృష్ణమాచారి మాట్లాడారు. వేదాచారి క్యాన్సర్‌తో బాధపడుతూనే ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించాడని, వైద్య విద్యను పూర్తి చేసి ప్రభుత్వ సివిల్ సర్జన్‌గా సేవలు అందించాడని, తుదిశ్వాస విడిచే వరకు పేదలకు వైద్యం చేశాడని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అర్పిత, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సాదత్, చంద్రకళ, నాగరాణి, రాయబోస్, రవికుమార్, రవీందర్, రమేశ్, రాజేశ్, సంతోశ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన కొండూరు వాసులు



అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న గ్రామస్తులు

రాయపర్తి : మండలంలోని కొండూరు వాసులు మానవత్వం చాటారు. గ్రామానికి చెందిన బుడిగ జంగాల కులానికి చెందిన జంగాల కుమార్ (45) అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబం దహన సంస్కారాలు నిర్వహించలేని దయనీయ స్థితిలో ఉండగా గ్రామస్తులు స్పందించారు. పలువురు కలిసి స్వర్గరథం తీసుకొచ్చి డప్పుచప్పుళ్ల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులే చొరవ తీసుకుని అంత్యక్రియలు నిర్వహించడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.